సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 18 । మార్చి । 2023



పాఠశాలల తనిఖీ

వేములవాడఅర్బన్: నాంపెల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, పట్టణంలోని కేజీబీవీని డీఈవో రమేశ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు.



భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

'సెస్'పై బకాయిల భారం

- రూ.272.12 కోట్ల విద్యుత్ బకాయిలు
- ప్రస్తుత బకాయిలే రూ.65.12 కోట్లు
- పాత విద్యుత్ బకాయిలు రూ.207 కోట్లు
- సర్కారు బిల్లులే గుదిబండలు
- కరెంట్ బిల్లుల వసూళ్లలోనూ నిర్లక్ష్యం
- ప్రతి నెలా వసూళ్ల లక్ష్యం రూ.11.96 కోట్లు



విద్యుత్ పంపిణీ చేసే ట్రాన్స్‌ఫార్మర్



రాజన్న సిరిసిల్ల జిల్లాలో మీటర్ రీడింగ్

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో విద్యుత్ పంపిణీ చేస్తున్న సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఏటా పెరుగుతున్న విద్యుత్ బకాయిల భారంతో సంస్థ సతమతమవుతోంది. ప్రభుత్వ ఆఫీస్‌లు, గ్రామపంచాయతీలు, నీటి పథకాలు, పవర్‌లూమ్ సబ్సిడీ విద్యుత్ బిల్లులు ఏళ్ల తరబడి విడుదల కావడం లేదు. కొందరు విద్యుత్ వినియోగదారులు సైతం బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో 'సెస్' రూ.272.12 కోట్ల బకాయిల భారంతో ఉంది. ఇటీవల ఎన్నికైన 'సెస్' పాలకవర్గం సైతం బకాయిల వసూళ్లపై దృష్టి సారించకపోవడంతో నిర్వహణ కష్టాలతో 'సెస్' సంస్థ ఇబ్బంది పడుతుంది. ప్రభుత్వం ద్వారా రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం నిరీక్షిస్తుంది.

బిల్లుల వసూళ్లపై పట్టింపు ఏదీ..?

మొండి బకాయిల వసూళ్లకు గతంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించే వారు. సిబ్బంది మొత్తాన్ని ఒక్క మండలంలో మోహరించి బకాయిలు వసూలు చేసేవారు. ఇప్పుడు ఆ స్పెషల్ డ్రైవ్‌లు లేవు. 'సెస్' కొత్త పాలకవర్గం విద్యుత్ బిల్లుల వసూళ్లపై శ్రద్ధ వహించి సంస్థ ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గతమెంతో ఘనం

సిరిసిల్ల, వేములవాడ పాత తాలూకాల పరిధిలో 1970 ప్రాంతంలో 'సెస్'ను ప్రారంభించారు. పరస్పర సహకారంతో 'సెస్' సంస్థ పల్లెల్లో విద్యుత్ పంపిణీ చేసింది. ఎన్పీడీసీఎల్ నుంచి కరెంట్‌ను కొనుగోలు చేసి, వినియోగదారులకు సరఫరా చేస్తోంది. వినియోగదారుల వద్ద విద్యుత్ బిల్లులను వసూలు చేసి ఎన్పీడీసీఎల్‌కు చెల్లిస్తుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడం, మరమగ్గాలకు 50 శాతం రాయితీపై విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఇవి పోను మిగతా వినియోగదారుల వద్ద బిల్లులు సరిగ్గా వసూలు కావడం లేదు. దీంతో ప్రభుత్వ బకాయిలు పేరుకుపోతున్నాయి.

ఇవీ ప్రస్తుత విద్యుత్ బకాయిలు

కేటగిరీ	కనెక్షన్లు	బకాయిలు
గృహాలు	1,69,628	రూ.28.46 కోట్లు
షాపులు	13,238	రూ.8.98 కోట్లు
పరిశ్రమలు	1657	రూ.3.54 కోట్లు
పవర్‌లూమ్స్	5756	రూ.1.64 కోట్లు
వ్యవసాయం	74,645	రూ.7.63 కోట్లు
నీటి పథకాలు, వీధిదీపాలు	3,118	రూ.11.60 కోట్లు
ఆలయాలు, స్కూళ్లు	963	రూ.3.25 కోట్లు
మొత్తం	2,69,005	రూ.65.12కోట్లు

గతంలో పూర్తి స్థాయిలో విద్యుత్ బిల్లులు వసూలు అయ్యేవి. ఆలస్యమైతే రూ.50 జరిమానాలు విధించే వారు. 'సెస్' సంస్థకు వివిధ జాతీయ బ్యాంకుల్లో రూ.లక్షల్లో డిపాజిట్లు ఉండేవి. క్రమంగా ఆ డిపాజిట్లు కరిగిపోయాయి. 'సెస్' ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

సర్కారు బకాయిలే దిగుబండలు

గ్రామపంచాయతీల వీధిదీపాలు, నీటి పథకాలకు చాలా కాలం మీటరు లేక, బిల్లులు చెల్లింపులు లేక విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలోని 255 గ్రామాలకు సంబంధించిన వీధిదీపాలు, నీటి పథకాల విద్యుత్ బిల్లులు రూ.157 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల మగ్గాలకు (పవర్‌లూమ్స్) యాభై శాతం విద్యుత్ సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. వీటికి సంబంధించి రూ.46 కోట్లు బకాయిలు ఉన్నాయి. నిర్మాణాలకు సంబంధించి మరో రూ.4 కోట్ల బకాయిలున్నాయి. ఇలా పాత బకాయిలే రూ.207 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తరువాత చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఆ బకాయిలను పక్కకు పెట్టారు. ఇంకా స్కూల్స్, దేవాలయాలకు సంబంధించిన బిల్లులు కూడా ప్రభుత్వమే చెల్లిస్తామని స్పష్టం చేసింది. కానీ ఇప్పటి వరకు పాత బకాయిలు విడుదల కావడం లేదు. ఇలా ప్రభుత్వ ఆఫీస్‌లు, సంస్థలకు సంబంధించిన మొండి బకాయిలు 'సెస్'కు గుదిబండగా తయారయ్యాయి. ఇవి కాకుండా సాధారణ విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రతీ నెల రావాల్సిన విద్యుత్ బిల్లులను వసూలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా బకాయిలు పెరుగుతూనే ఉన్నాయి.

బకాయిలు వసూలు చేస్తాం..



విద్యుత్ బకాయిలను వసూలు చేస్తాం. ప్రభుత్వం ద్వారా రావాల్సిన బిల్లుల కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ నెలాఖరులోగా రూ.6 కోట్లు వస్తాయని ఆశిస్తున్నాం. మూడు నెలల్లో బకాయిల వసూళ్లకు మా పాలకవర్గం చర్యలు తీసుకుంటుంది. విద్యుత్ అక్రమ వినియోగాన్ని అరికడుతాం. విద్యుత్ బకాయిలను సీరియస్ వసూలు చేస్తాం. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతోపాటు గ్రామాలవారీగా డ్యూస్ లిస్ట్ తయారు చేసి క్షేత్రస్థాయి సిబ్బందితో వసూలు చేస్తాం.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్

న్యూస్‌రీల్

పల్లెలు పచ్చదనంతో ఉన్నాయి



శివంగాలపల్లిలో స్వచ్ఛభారత్ బృందం

కోనరావుపేట(వేములవాడ): పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయని స్వచ్ఛభారత్ మిషన్ ఎస్‌బీఎం ట్రైనర్ సురేశ్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలంలో స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ శిక్షణలో భాగంగా శివంగాలపల్లిలో శుక్రవారం పర్యటించారు. గ్రామపంచాయతీలో సామాజిక చిత్రపటాన్ని వేసి, అవగాహన కల్పించారు. సర్పంచ్ సురేశ్‌యాదవ్ మాట్లాడుతూ నిత్యం ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్ట్‌షెడ్‌కు తరలిస్తున్నామన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో శ్రీనివాస్, ఎస్‌బీఎం ట్రైనర్ ప్రదీప్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు ఆసిన్

సిరిసిల్లటౌన్: వీధికుక్కలు బాలుడిపై మూకుమ్మడి దాడి చేసిన సంఘటన సిరిసిల్లలో ఆందోళనకు దారితీసింది. స్థానిక 21వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిన్(5) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అటువైపు వచ్చిన పదుల సంఖ్యలో కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. ముఖం, చాతిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమేయడంతో ప్రాణాపాయ స్థితి తప్పిందని బాలుడి కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పట్టా చేయడం లేదని ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు తాగిన సురేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన బింగి సురేశ్(35) తన తల్లిదండ్రులు భూమి పట్టా చేయడం లేదని మనస్తాపంతో శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. కిష్టంపల్లి శివారులోని భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా అందుకు తల్లిదండ్రులు నిరాకరించినట్లు సురేశ్ భార్య మానస తెలిపారు. భూమి దక్కదనే బెంగతో సురేశ్ పురుగుల మందు తాగాడు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మానస ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



చిన్నారులను ప్రశంసిస్తున్న ఎస్పీ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో సిరిసిల్లకు చెందిన చిన్నారులు ప్రతిభ చాటారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 15న నిజామాబాద్ జిల్లాలో అమెతుర్ ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా దస్‌కా దమ్ పేరిట పోటీలు నిర్వహించింది. మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఆరుగురు అండర్–14లో ప్రతిభ కనబరిచారు. దాసరి రశ్మిత(తృతీయ), బీ–గ్రూప్‌లో ఒడ్నాల కీర్తన (తృతీయ) స్థానాల్లో నిలిచి జాతీయ స్థాయి ఖేలో ఇండియాకు ఎంపికయ్యారు. ప్రవల్లిక, లక్ష్మీప్రసన్న అధిత్రి, హరిణిలు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

- బాల్య వివాహాలు నిలిపివేయాలి
- సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రుద్రంగి(వేములవాడ): యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. రుద్రంగి మండలంలోని బడితండాలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గిరిజన యువకు, క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు. చదువుతోనే బతుకులు మారుతాయని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువాలని సూచించారు. డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, రుద్రంగి, చందుర్తి ఎస్సైలు ప్రభాకర్, రమేశ్, గిరిజనతండాల గ్రామస్తులు హాజరయ్యారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున అకాల వర్షాలు కురిశాయి. వీర్నపల్లిలో అత్యధికంగా 21.5 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. అత్యల్పంగా రుద్రంగిలో 2.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. చందుర్తిలో 9.1, వేములవాడ రూరల్‌లో 8.3, బోయినపల్లిలో 9.1, వేములవాడలో 18.5, సిరిసిల్లలో 12.3, కోనరావుపేటలో 18.4, ఎల్లారెడ్డిపేటలో 12.6, గంభీరావుపేటలో 10.9, ముస్తాబాద్‌లో 3.0, తంగళ్లపల్లిలో 7.8, ఇల్లంతకుంటలో 11.1 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో సగటున 11.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదయింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 870.6 మిల్లీమీటర్లు కాగా.. ఈ ఏడాది వర్షాకాలంలో 1229.2 మిల్లీమీటర్లు పడింది. 48 శాతం అదనపు వర్షం కురిసింది. వేసవిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో జిల్లాలో చలిగాలులు వీస్తున్నాయి.

రాజన్నా దీవించు



వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బంగారం, రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు.



అద్దాల మంటపంలో అర్చకులు పాదపూజ చేసి పండ్లు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వీహెచ్‌పీ నాయకులు మధు రాధాకిషన్, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు, అర్చకులు పాల్గొన్నారు.

అధికారులతో జిల్లా జడ్జి సమీక్ష

- పాల్గొన్న ఎస్పీ, అడిషనల్ కలెక్టర్లు



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల కోర్టుహాలులో శుక్రవారం జిల్లా జడ్జి ప్రేమలత జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. క్రిమినల్ కేసుల వివరాలు, కేసుల్లో సాక్షులను కోర్టుల ప్రవేశపెట్టే విధానం, వారెంట్ల పెండింగ్ అమలు తదితర అంశాలపై మాట్లాడారు. పోలీస్ అధికారులతో పోలీస్‌స్టేషన్ల వారిగా వివరాలను తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ డి.చంద్రయ్య, డీఎస్పీలు విష్ణుప్రసాద్, నాగేంద్రచారి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పవన్‌కుమార్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరు పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- నూతన చైర్మన్‌గా నారాయణ



నారాయణను అభినందిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: పెద్దూరు పీఏసీఎస్ చైర్మన్ వెంకటలక్ష్మిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సింగిల్‌విండో కార్యవర్గ సమావేశానికి ఒక్క రోజు ముందే చైర్మన్ పదవికి బర్కం వెంకటలక్ష్మి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం పెద్దూరు సింగిల్ విండో కార్యాలయంలో డీసీవో బుద్దనాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. గత నెలలో చైర్మన్ బర్కం వెంకటలక్ష్మిపై అవిశ్వాసం ప్రకటిస్తూ 10 మంది సభ్యులు డీసీవోకు నోటీసు అందించిన విషయం తెలిసిందే. క్యాంపు నుంచి నేరుగా వచ్చిన డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించడంతో చైర్మన్ పదవి నుంచి బర్కం వెంకట లక్ష్మిని తొలగించినట్లు డీసీవో తెలిపారు. దీంతో బీజేపీకి ఉన్న ఏకైక ప్యాక్స్ చైర్మన్ పదవిని బీఆర్‌ఎస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. తాత్కాలిక చైర్మన్‌గా బెజ్జారపు నారాయణను నియమించినట్లు డీసీవో తెలియజేశారు. 20వ తేదీన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రైతుబంధు మండలాధ్యక్షుడు అగ్గిరాములు, డైరెక్టర్లు రమణారావు, జీల కిషన్, సలేంద్రి బాలరాజ్, మంగ కిరణ్, ముష్కం లీల, ఆదిపెల్లి లక్ష్మి, బడుగు లక్ష్మి, కిషన్‌నాయక్, భాస్కర్‌గౌడ్, భాగయ్య, రాజేందర్, తదితరులు ఉన్నారు.

పోలీసుల బందోబస్తు

సింగిల్ విండో కార్యవర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో డీఎస్పీ విశ్వప్రసాద్, టౌన్ సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మూడేళ్ల క్రితం జరిగిన చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దానిని దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీగా మోహరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సింగిల్ విండో కార్యాలయం వద్ద బందోబస్తు చేపట్టారు.

హైరిస్క్ కేసులపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వివరాలు అడుగుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలని, ప్రసూతి మరణాలు లేకుండా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు వైద్యం అందించే అంశంపై ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు జ్వరం వచ్చినా వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించాలన్నారు. హైరిస్క్ ఉంటే జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. శిశుమరణాలు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యపరీక్షలు చేయాలన్నారు. గతంలో జరిగిన శిశుమరణాలు, గర్భిణుల మరణాలకు కారణాలను పూర్తి స్థాయిలో విశ్లేషించాలని, వాటిని అధిగమించి మెరుగైన వైద్యసేవలందించాలని అనురాగ్ జయంతి కోరారు. జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, జిల్లా ఉప వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్ రావు, వేములవాడ ఆస్పత్రి పర్యవేక్షకులు మహేశ్ రావు, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు శోభారాణి, అరుణ, తిరుపతి, ప్రోగ్రాం ఆఫీసర్ మహేశ్, మెడికల్ ఆఫీసర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడలో..


వేములవాడఅర్బన్: గర్భిణులలో హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి తరలించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వేములవాడ మండలం చీర్లవంచలోని పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. సబ్‌సెంటర్‌ల వారీగా గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత డెలివరీలు, క్షయ వ్యాధి బాధితుల గుర్తింపు గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి అవసరమైన చికిత్స, మందులు అందించాలని ఆదేశించారు.

ఆరోగ్యం ఎలా ఉంది..?

- ఆరోగ్యం ఎలా ఉంది. వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలు తదితరాల గురించి అడిగి తెలుసుకున్నారు. చీర్లవంచకు చెందిన గర్భిణీ ఎర్నాల సునీత ఇంటికెళ్లి వైద్యసిబ్బంది ఆరా తీశారు.
- డీఎంహెచ్ఓ డా.శ్రీరాములు, డా.రజిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.రామకృష్ణ, డీడీఎం కార్తీక్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- సిరిసిల్ల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- సిరిసిల్లలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో సమావేశం



సారయ్యను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల: జిల్లాలో భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జిగా బస్వరాజు సారయ్య నియమితులైన తరువాత పార్టీ నాయకులను కలిసేందుకు సిరిసిల్లకు వచ్చారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు జిల్లాలో బలమైన కేడర్ ఉందని, అందరినీ కలుపుకొని ముందుకు పోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు పనిచేయాలన్నారు. విభేదాలు వీడి క్రమశిక్షణ గల నాయకులుగా, కార్యకర్తలుగా పార్టీ కోసం పని చేయాలన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు అక్కరాజు శ్రీనివాస్, కుంబాల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సారయ్యకు సన్మానం

జిల్లా ఇన్‌చార్జిగా సిరిసిల్లకు వచ్చిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, యూత్ అధ్యక్షుడు వడ్నాల విక్రమ్ సన్మానించారు. సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు బాలయ్య, దండు శ్రీనివాస్, దండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని చంద్రగిరి పరిధిలోని అగ్రహారం వద్ద అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. చంద్రగిరి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 6ను ఆనుకుని ఉన్న చెరువు శిఖం భూమిలో శివరాత్రి సునీల అక్రమంగా నిర్మిస్తుందన్న వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ ఆదేశాలతో ఇంటిని జేసీబీ సహాయంతో కూల్చివేశామని వేములవాడ ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

● బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మున్నూరుకాపులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలో మున్నూరు సంఘ భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సంఘం మండలాధ్యక్షుడు నంది కిషన్‌, సెస్‌ డైరెక్టర్‌ వర్ష కృష్ణహరి, వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

చెట్లు నరికివేత


రోడ్డు పక్కనే నరికివేసిన నీలగిరి చెట్లు

కోనరావుపేట : మండలంలోని అటవీ ప్రాంతాల్లో అధికారులు నాటిన నీలగిరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరుకుతున్నారు. మండలంలోని మరిమడ్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య అటవీప్రాంత శివారులో అధికారులు ప్లాంటేషన్‌లో భాగంగా నీలగిరి మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి వనంలా మారగా ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తుందని తెలియడంతో కొందరు చెట్లను నరికివేస్తున్నారు. ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోయినపల్లి ఎస్సై బదిలీ

బోయినపల్లి: బోయినపల్లి ఎస్సై పుల్లా అభిలాష్‌ను కరీంనగర్‌ జిల్లా గంగాధర పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా బోయినపల్లి ఎస్సైగా ఎవరిని నియమిస్తారనే విషయం మండలంలో ఆసక్తి నెలకొంది.

పోకిరి అరెస్టు

వేములవాడ: కోనరావుపేట మండలంలోని కమ్మరిపేటతండాకు చెందిన ఓ యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకోకుంటే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన కామారెడ్డి జిల్లాకు చెందిన గంటాడి సాయికుమార్‌ను అరెస్ట్‌ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. సాయికుమార్ను జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడితే పోలీసులను ఆశ్రయించాలని డీఎస్పీ కోరారు.

అశ్లీల చిత్రాలు షేర్‌ చేసిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం: చిన్నారుల అశ్లీల (పోర్న్‌) వీడియోలు చూస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన గణేశ్‌ కొన్నేళ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడే పాకిస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తితో పరిచయమైంది. వీరిద్దరూ అప్పుడప్పుడు ఫోన్‌లో పోర్న్‌ వీడియోలు చూడడంతో పాటు వాటిని షేర్‌ చేసుకునేవారు. గతేడాది జూన్‌11న అశ్లీల వీడియోలను వేరేవ్యక్తి వాట్సాప్‌ ద్వారా పంపించాడు. వాటిని మరొకరికి పంపే క్రమంలో వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గణేశ్‌పై కేసు నమోదు చేశారు. వీడియోలు దొరకడంతో శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. చిన్నపిల్లల పోర్న్‌ వీడియోలు చూసినా, డౌన్‌లోడ్‌ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

బినామీల జోరు

● వివిధ వర్గాలు, ప్రముఖుల పేర్లతో వీఐపీ దర్శనాలు
● రాజన్న ఆలయ ఆదాయానికి గండి
● అధికారులు దృష్టిసారించాలని డిమాండ్‌


ఆలయంలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో బినామీల జోరు పెరిగింది. తమ డిపార్ట్‌మెంట్లు, వివిధ వర్గాలు, ప్రముఖుల పేర్లతో వీఐపీ దర్శనాలు చేయించుకుంటూ రాజన్న ఆదాయానికి గండి కొడుతున్నట్లు ఉద్యోగ వర్గాలు చర్చలు జోరుగా సాగుతున్నాయి. డబ్బులు వెచ్చించి గంటల తరబడి క్యూలైన్లలో వేచిచూస్తున్న భక్తుల ముందే సదరు వీఐపీలు ఉచితంగా రాజన్నను దర్శించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ ఉద్యోగం, సామాజిక సేవ చేయని వ్యక్తులు సైతం నేరుగా ఆలయంలోకి తమవారిని దర్శనాలకు తీసుకెళ్తున్నట్లు ప్రచారం..

పలుకుబడితో..

రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ముందుగా టికెట్లు తీసుకుంటారు. అయితే కొందరు బినామీలు తమ పలుకుబడిని ఉపయోగించుకొని దందా మొదలు పెడుతున్నారు. ఆలయానికి ఎలాంటి సంబంధం లేకున్నా తమ వారికి దర్శనాలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. జర్నలిస్టులు, ఇతరుల పేర్లు చెప్పుకుంటూ ఉద్యోగులను బెదిరిస్తూ యథేచ్ఛగా దర్శనాలు చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు దృష్టిసారించాలి

కొందరు ఉన్నతాధికారుల పేర్లు, వారి బంధువులుగా చెప్పుకుంటూ ఇతర భక్తులను దైవ దర్శనాలకు తీసుకెళ్తున్నట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. వీరికి ఎలాంటి అర్హతలు లేకున్నా నేరుగా ఆలయంలోకి తీసుకెళ్తూ వీఐపీలుగా గౌరవిస్తున్నట్లు ఉద్యోగుల్లో జోరుగా చర్చ సాగుతోంది. దీనిపై అధికారులు దృష్టిసారించి బినామీల బెడద లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

డ్రెస్‌కోడ్‌ అమలు చేయాలి



ఆలయంలో ఎవరు పనిచేస్తున్నారో అర్థం కావడం లేదు. ఉద్యోగులెవరో, బయటి వ్యక్తులెవరో తెలియకుండా పోతోంది. ఉద్యోగులకు డ్రెస్‌కోడ్‌ అమలు చేయాలి. అలాగే ప్రతి ఉద్యోగి మెడలో గుర్తింపుకార్డు ఉండేలా చూడాలి. గతంలో ఈవో దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. కలెక్టర్‌ స్పందించి చొరవ తీసుకుంటే బాగుంటుంది.

– నందిపేట సుదర్శన్‌ యాదవ్‌, మాజీ ధర్మకర్త

అనుమతులు లేకుండా రానివ్వం



రాజన్న ఆలయంలో స్వచ్ఛందంగా సేవచేసే వ్యక్తులైనా సరే ఆలయ ఈవో అనుమతి తీసుకున్న తర్వాతే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీచేస్తాం. అనుమతులు లేకుండా ఎవరూ ఆలయంలో విధులు నిర్వహించాల్సిన అవసరం లేదు. ఆలయ, సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. డ్రెస్‌కోడ్‌, ఐడీకార్డులు ధరించే విషయంపై ఉద్యోగులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం.

– కృష్ణప్రసాద్‌, ఆలయ ఈవో

వైభవంగా కన్యకా పరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

● ప్రవచనాలు వినిపించిన మాధవానంద సరస్వతీ ● హాజరైన రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌గుప్తా


విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు


శ్రీనివాస్‌ గుప్తను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్వామీజీ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు దేవున్ని స్మరించుకోవాలన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌ వన్‌

సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌ వన్‌గా ఉందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరై మాట్లాడారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు పూర్ణకుంభ స్వాగతం పలకగా, వైశ్యులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అరుణ్‌ మృతదేహం

జ్యోతినగర్‌(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రామగుండం బీ పవర్‌హౌస్‌ రాజీవ్‌ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దెదావత్‌ అరుణ్‌(22) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ న్యూపీకే రామయ్యకాలనికి చెందిన దెదావత్‌ అరుణ్‌ తన సోదరుడిని రామగుండం రైల్వే స్టేషన్‌ నుంచి తీసుకురావడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కల్వర్టు వద్ద వాహనంపై నుంచి పడి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనా స్థలంతో పాటు ఆస్పత్రిలోని తరుణ మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాద వివరాలపై విచారణ చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రముఖ వ్యాపారి..

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన బాలాజీ హార్డ్‌వేర్‌ యజమాని నారాయణదాస్‌ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. నారాయణదాస్‌ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వంశీ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి గ్రామ పరిధిలోని సిద్దిపేట–సిరిసిల్ల ప్రధాన రహదారిలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు సిరిసిల్ల వంశీ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రియల్‌ ఎస్టేట్‌ మాఫియాకు చెందిన కొందరు విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చదును చేయడంతో పాటు దిమ్మెను కూడా కూల్చివేశారన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

రామగిరి(మంథని): ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన పంజాల శ్యామల(40) వివాహిత కడుపు నొప్పి భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ముత్తారం ఎస్సై రాములు కథనం ప్రకారం.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయం ప్రతిష్ఠాపనోత్సవాలకు కొడుకు శ్రీకాంత్‌తో గురువారం సాయంత్రం కలిసి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఈక్రమంలో శ్యామలకు విపరీతంగా కడుపు లేవడంతో శ్రీకాంత్‌ స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చేలోపు క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో గమనించిన శ్రీకాంత్‌ తన స్నేహితుడి సాయంతో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నదిలో దూకేందుకు యత్నం..

• కాపాడిన రివర్‌ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి శుక్రవారం నదిలోకి దూకేందుకు యత్నించిన ఓ వ్యక్తిని రివర్‌ పోలీసులు కాపాడారు. టూటౌన్‌ పోలీసులు, రివర్‌ పోలీసులు కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యలతో కొంతకాలంగా మానసికవేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది తన వాట్సప్‌లో మెడలో దండవేసుకుని ఫొటోపై ఓం శాంతి అని రాసుకుని గోదావరినది వద్దకు వచ్చి దూకేక్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్‌ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్‌ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. సదరు వ్యక్తిని కాపాడిన రివర్‌ పోలీసులను సీఐ వేణుగోపాల్‌ అభినందించారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలి

పెద్దపల్లిరూరల్‌: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను వర్తింప జేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్‌ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలని డిమాండ్‌ చేశారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్సీ ఎల్‌.రమణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌ హాజరవుతున్నారని అన్నారు.

కేసీఆర్‌ ఆరోగ్యం కోసం హోమం

గోదావరిఖని: ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్‌ కోలేటి దామోదర్‌ శుక్రవారం వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిఖనిలోని తన నివాసంలో ప్రత్యేక హోమం చేశారు. బీఆర్‌ఎస్‌ పార్టీ జాతీయ స్థాయిలో పుంజుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

జ్యోతినగర్‌: జాతీయస్థాయి రోలర్‌స్కేటింగ్‌ పోటీలకు ఎన్టీపీసీకి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో స్నితిక, దేవాన్షీ, అయనా, బాలుర విభాగంలో ఆరాధ్య, అద్వితలాల్‌, భార్గవ్‌రామ్‌, అక్షిత్‌ శౌర్య, సాయి సిద్దార్థ్‌లు విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఛండీఘడ్‌లోని మొహాలిలో ఏప్రిల్‌ 26 నుంచి 29వ వరకు నిర్వహించే జాతీయ స్థాయి రోలర్‌ స్కేటింగ్‌ పోటీలలో పాల్గొంటున్నట్లు కోచ్‌ కృష్ణగౌడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎన్టీపీసీ యాజమాన్యం పలువురు అభినందించారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్‌


అశోక్‌


బంగారు ఆభరణాలు

బోయినపల్లి (చొప్పదండి): చోరీకేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్‌ సీఐ బన్సీలాల్‌ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీకి చెందిన సత్తయ్య ఇంట్లో ఈనెల 3న, 11 తులాల బంగారు, నగలు, 6 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదు చోరీ జరిగింది. దీంతో బోయినపల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్‌ మహాజన్‌, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆదేశాల మేరకు సిబ్బంది విచారణ చేపట్టారు. ఈనెల 16న వేములవాడ ఆలయ పరిసరాల్లో జగిత్యాల జిల్లా కొండగట్టుకు చెందిన పసుపులేటి అశోక్‌ను విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అతని నుంచి 2 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలోని జగిత్యాల, చొప్పదండి, వెల్గటూర్‌, గొల్లపల్లి, రామడుగు పీఎస్‌ల పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. కాగా జైలులో పరిచయమైన ఓ వ్యక్తితో కలిసి అశోక్‌ నీలోజిపల్లిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నగలను విక్రయించేందుకు వేములవాడ రాగా చాకచక్యంగా అశోక్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో మరో వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

బుర్రకథ కళాకారుడికి ఆర్థిక సాయం

● మానవత్వం చాటుకున్న 'బలగం' చిత్ర దర్శకుడు వేణు


బుర్రకథ కళాకారులు కొమురవ్వ, మొగిలయ్యను సన్మానిస్తున్న 'బలగం' దర్శకుడు వెల్దండి వేణు

సిరిసిల్ల : సిరిసిల్లకు చెందిన సినీ హాస్యనటుడు, 'బలగం' చిత్ర దర్శకుడు యెల్దండి వేణు మానవత్వం చాటుకున్నారు.'బలగం' సినిమాలో క్లైమాక్స్‌లో బుర్రకథతో అందరి హృదయాలను కదిలించారు కొమురవ్వ, మొగిలయ్య. కళాకారుడు మొగిలయ్య కిడ్నీలు పాడై డయాలసిస్‌ చేయించుకుంటున్నట్లు తెలియడంతో చిత్ర దర్శకుడు యెల్దండి వేణు స్పందించారు. వరంగల్‌ జిల్లా దుగ్గొండిలోని కొమురవ్వ, మొగిలయ్య ఇంటికి వెళ్లి రూ.లక్ష ఆర్థికసాయంగా అందజేశారు. చిత్ర నిర్మాత దిల్‌ రాజ్‌తో మరింత ఆర్థికసాయం అందేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా వారిని వేణు సన్మానించారు. సిరిసిల్లకు చెందిన బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్‌, పాటల రచయిత శ్యామ్‌ కాసర్ల, యాంకర్‌ గీత భగత్‌, దార్ల సందీప్‌, సామాజిక వేత్త కాయితి బాలు, నర్సంపేట సీఐ పులి రమేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ శంకరమ్మ


మాట్లాడుతున్న ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ శంకరమ్మ

చందుర్తి (వేములవాడ): నవజాత శిశువుల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు దృష్టి సారించాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శంకరమ్మ కోరారు. మండలంలోని మర్రిగడ్డ రైతు వేదికలో అన్నిగ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు నవజాత శిశువుల సంరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువులను గుర్తించడంలో నిర్లక్ష్యంగా వహించవద్దన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాత పద్మ, గుర్ర రేణుక, ఆయేషా ఆశ్రీం, జ్యోతి, ప్రభావతి, రమ, రాధిక, విజయ, పుష్ప, సంధ్య, అనిత, గంగలక్ష్మి, మంగ శోభ, నాగలక్ష్మి, భూజ్యోతి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పీసీ ప్రశాంత్‌

వీర్నపల్లి (సిరిసిల్ల) : సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ పోలీసింగ్‌ వర్టికల్‌ ఇన్‌చార్జి పీసీ ప్రశాంత్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్‌ మీడియాలో పలు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్‌లో లావాదేవీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులు హెల్మెట్‌ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిషన్‌ రావు, లచ్చయ్య, రియాజ్‌ సర్పంచ్‌ పాటి దినకర్‌, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌ కుమార్‌, ఉపసర్పంచ్‌ బోయిని రవి, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు భగవంతం, గ్రామస్తులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ...తిరిగి రాని లోకాలకు

• రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్త ,మరొకరికి గాయాలు
• ఆర్టీసీ బస్సు...లారీ డ్రైవర్ల అజాగ్రత్తే కారణం


సౌజన్య(ఫైల్‌)


ప్రమాద స్థలంలో సౌజన్య, మధూకర్‌

మంథని: ఓ శుభకార్యానికి వెళ్తున్న భార్యభర్తలను ప్రమాద రూపంలో భార్యను మృత్యువు కబలించగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వీరితో పాటు వచ్చిన సమీప బంధువైన బాలుడికి సైతం తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మంథని మండలం భట్టుపల్లి బస్టాఫ్‌ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన రాపాక మధూకర్‌ తన భార్య సౌజన్య(28) అన్న కుమారుడు యశ్వంత్‌తో కలిసి బైక్‌పై జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా గొర్లవీడులో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో భట్టుపల్లి బస్టాండ్‌ వద్ద ఆర్టీసీ బస్సు నిలిచి ఉండడంతో పక్కనుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సుడ్రైవర్‌ బైక్‌ను గమనించకుండా సైడ్‌నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ముగ్గురు కిందపడ్డారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా, అజాగ్రత్తగా వస్తూ మధూకర్‌, యశ్వంత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాలు, తలకు గాయాలయ్యాయి. సౌజన్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై స్పాట్‌లోనే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. గాయపడిన మధూకర్‌, యశ్వంత్‌ను మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్‌ తరలించారన్నారు. మృతురాలి తండ్రి నాంసాని అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పవిత్ర స్థలం.. పనులు సులువు

• శివలింగం జరపొద్దు
• అంకుటితో దీక్షతో పనులు వేగం
• తోగుటరంగపేటసరస్వతిపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీమాధవానందసరస్వతి స్వామి


మాట్లాడుతున్న శ్రీశ్రీమాధవానంద సరస్వతి స్వామి

సుల్తానాబాద్‌: ఈ ఆలయ స్థలం చాలా పవిత్రమైనదని పనులు అనుకుని పూజిస్తే సులువుగా అవుతాయని తోగుట రంగపేట సరస్వతీ పీఠాధిపతులు శ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. సుల్తానాబాద్‌ పట్టణంలోని అతిపురాతన ఆలయమైన మిట్టపల్లిలోని శ్రీ శంకర దేవాలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి హాజరై శుక్రవారం పరిశీలించి, అర్చకులు, పుర ప్రముఖులతో చర్చించారు. ఆలయంలోని శివలింగాన్ని జరపకుండా మిగిలిన విగ్రహాలను జరపవచ్చన్నారు. కార్యక్రమంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, గోపి, లక్ష్మణ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

రామగుండం: రాజీవ్‌రహదారిపై కుందనపల్లి సమీపంలోని భారత్‌ పెట్రోల్‌ పంపు వద్ద శుక్రవారం ఎదురెదురుగా కారు–లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంతర్గాత ఎస్సై బోగె సంతోశ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రావుల రఘు–సరోజన దంపతులు బెల్లంపల్లిలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి కరీంనగర్‌వైపు కర్రలోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. కారులో ఉన్న వారికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.